క్లుప్తంగా

కుసుమహరుల దివ్యలీలా కల్యాణం



నల్లకుంట: నల్లకుంట టీఆర్టీకాలనీ కుసుమహరనాథుల నామస్మరణలతో మార్మోగింది. ఆదివారం కుసుమహనాథ ఆశ్రమ వార్షికోత్సవంలో భాగంగా ఉదయం సుప్రబాత సేవ, 'జయ హరనాథ జయ కుసుమ కుమారి జయ' ఏకాహము నిర్వహించారు. ఉదయం 10 గంటలకు 'కుసుమహరుల దివ్యలీలా కల్యాణం' జరిగింది. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి: మున్నూరుకాపుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు దశరథం, ప్రధాన కార్యదర్శి మహేందర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ శాసనసభ సమావేశాలు జరుగుతున్నందున కార్పొరేషన్ ఏర్పాటు విషయం అసెంబ్లీలో లేవనెత్తాలని ఈ సందర్భంగా మున్నూరుకాపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం

చిక్కడపల్లి: భార్య తిట్టిందని ఓ భర్త అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అశోక్‌నగర్‌లో నివసించే అశోక్ (30) ఇస్త్రీ చేసుకుంటూ.. జీవనం సాగిస్తున్నాడు. కాగా గత కొంతకాలంగా తాగుడుకు బానిసై ఖాళీగా ఉండటంతో భార్య నాగు మందలించింది. దీంతో అతడు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల వద్ద కూడా ఆచూకీ లభించకపోవడంతో శనివారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

లాలాపేట: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. లాలాపేటలోని ప్రొ.జయశంకర్ ఇండోర్ స్టేడియంలో గత కొన్ని రోజుల నుంచి వెటరన్స్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. 13–75 ఏళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో విజేతలకు ఆదివారం డిప్యూటీ మేయర్ బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. మోతే శోభన్‌రెడ్డి, సునీల్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు, దయాకర్, విఠల్, నవీన్, మధుబాబు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా..

లాలాపేట: పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా కల్పిస్తోందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. సయ్యద్ ఒమేర్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 60 వేల చెక్‌ను ఆదివారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఖాజా పాషా, షరీఫ్, జాహంగీర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన ఫిస్ట్‌బాల్ పోటీలు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన శ్రీపతి వెంకట్రావ్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఫిస్ట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ముగిసాయి. సీనియర్ బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, రంగారెడ్డి జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. జూనియర్ బాలుర విభాగంలో ఫైనల్స్‌లో వరంగల్ జిల్లా వశిష్ట స్కూలు జట్టు, సెయింట్ పీటర్స్ (హైదరాబాద్) జట్టుపై గెలిచి టైటిల్ సాధించింది. బాలికల సీనియర్ టైటిల్‌ను విల్లా మేరీ కాలేజీ, జూనియర్ విభాగంలో కస్తూర్బా కాలేజీ జట్లు విజేతలుగా నిలిచాయి. ముగింపు వేడుకలకు వెటరన్ అథ్లెట్, ఎమ్మెల్లార్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ముగింపు వేడుకల్లో తెలంగాణ ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్, స్పాన్సర్ శ్రీపతి రఘుచరణ్, ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కొమ్ము వెంకట్, వంశీ కృష్ణ, హోప్ విజయ్, రాగిరు ప్రభు కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఎం. జైరాజ్, సత్యనారాయణ, జగదీష్, మల్లేష్ యాదవ్, షకీబ్, మహేందర్ పాల్గొన్నారు.

రక్తహీనతపై సదస్సు

కంటోన్మెంట్: రక్తహీనతతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రముఖ హెమటాలజిస్ట్ డాక్టర్ కరుణకుమార్ అన్నారు. డాక్టర్ కేకేఆర్ కేన్సర్ కేర్ అండ్ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెస్ట్ మారేడ్‌పల్లిలో రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కరుణ కుమార్ మాట్లాడుతూ.. రక్తహీనతను సకాలంలో గుర్తిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు.

'హాత్‌సే హాత్ జోడో'యాత్రకు విశేష స్పందన



జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గం కాచిగూడ డివిజన్‌లో చేపట్టిన కాంగ్రెస్ హాత్‌సే హాత్ జోడో యాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రాగా.. జోడోయాత్ర విజయవంతంగా కొనసాగిందని ఆ పార్టీ నేతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఆర్.ఆశ్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరితిలక్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

- రాహుల్ గాంధీ తన 4 వేల కిలోమీటర్ల పాదయాత్రలో ఇచ్చిన సందేశాన్ని నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి చేర్చాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు.
- దేశ సమగ్రత, సమైక్యతను కాపాడాలని రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరించాలని ప్రచారం చేయాలన్నారు.
- మహిళలు బతుకమ్మ ఆటలు, కోలాటాలతో పాటు యువకుల నృత్యాలతో కోలాహలంగా జరిగిన ఈ పాదయాత్ర కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైంది. బస్తీలు వాడల మీదుగా కాచిగూడ కాళీమాత మందిర్ వద్దకు చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చందర్, సర్ఫరాజ్, జానీ పాషా, నర్సింగ్ రావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడు టిల్లు తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: శాసనసభ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ యువజన జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నారు. 'హాత్ సే హాత్ జోడో యాత్ర'కు నియోజవర్గ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలో జోడో యాత్ర నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తి విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వ ఆస్తులను బడా వ్యాపారులకు కట్టబెడుతోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీరాములు యాదగిరి, ముషీరాబాద్ ఏ -బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు లక్ష్మణ్, అనిల్‌కుమార్ యాదవ్, ప్రభాకర్, చంద్రశేఖర్, ధర్మేందర్, సాయిబాబా, మేడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



ఆర్టీసీ కల్యాణ మండపంలోని వేదికపై కాంగ్రెస్ ముఖ్యనేతలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఏకమై ఉద్యమించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికులు అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి 93వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్మికులు, ప్రజలు ఐక్యం కాకుండా విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ విషయాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, ఐఎన్‌టీయూసీ తెలంగాణ ఉపాధ్యక్షులు జనక్ ప్రసాద్, నల్లవెల్లి అంజిరెడ్డి, నాయకులు షరీఫ్, నాగన్నగౌడ్, ఉపేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందేలా కృషి చేయాలన్నారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, సంతోష్ కుమార్, సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, రవి యాదవ్, ఆర్.సంతోష్, నందు, గణేష్, శ్యామ్, నర్సింగ్‌రావు, బల్వీర్, దేవీప్రసాద్, రాము, వరలక్ష్మీ, మంగమ్మ, కృష్ణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం..

కవాడిగూడ: ప్రజా సమస్యలు పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం బోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి రాజకీయ లబ్ధి కోసమే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రతి నెల పేదలకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ బియ్యం అందిస్తోందన్నారు. దళిత బంధు పథకాన్ని అర్హులకు అందజేయకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు నందగిరి నర్సింహ్మా, రమేష్‌రావు, చంద్రమోహన్, రవి కుమార్, మసూద్, కవిత, పద్మజారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గిరిప్రసాద్‌ను సన్మానిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి జన్మదిన సప్తాహం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం లలిత కళావేదికలో బ్రహ్మణ సంక్షేమ భవన్ నిర్వహణలో అన్నమయ్య కీర్తనల గోష్ఠి గానం, శివ పార్వతి కల్యాణం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీబీ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ పాల్గొని మాట్లాడారు. అన్నమయ్య కీర్తనల్లో భావం అర్ధవంతంగా ఉంటుందని ఆయన కీర్తనలు సులభశైలిలో ప్రతి ఒక్కరూ పాడుకునే విధంగా ఉంటాయన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, బ్రహ్మణ సంక్షేమ భవన్ అధ్యక్షుడు గిరిప్రసాద్, సెన్సార్ బోర్డు సభ్యుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని వీవీ కరాటే అకాడమీ విద్యార్థులు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఏషియన్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 10 మందికి పసిడి, 8 మందికి రజతం, 12 మందికి కాంస్యం మెడళ్లు సాధించారు. సీఎం కేసీఆర్ ఛాంపియన్ షిప్ పోటీలలో కట్ట, కుమితీ విభాగాల్లో విద్యార్థులు పాల్గొని 3 గోల్డ్ , 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారని అకాడమీ అధ్యక్షుడు వినోద్ యాదవ్ తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఆదివారం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లోని మహేంద్ర గార్డెన్స్‌లో వినోద్‌యాదవ్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. దీపక్‌పటేల్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.



సమాజంలో తల్లిపాత్ర గొప్పది

హిమాయత్‌నగర్: సమాజంలో తల్లి పాత్ర ఎంతో గొప్పదని పలువురు వక్తలు అన్నారు. ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్, సాహితీ కిరణం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చిన్న కథల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని శ్రీముఖి కాంప్లెక్స్‌లో జరిగింది. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాస్, వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజు, సాహితీ కిరణం సం పాదకుడు పొత్తూరి సుబ్బారావు, గాయని ఆర్.దమయంతి మాట్లాడారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ అనాథ ఆశ్రమంలో చేర్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా విలువలు పెంపొందించి బాధ్యతయుతంగా పిల్లలను తీర్చిదిద్దడంలో అమ్మ పాత్ర కీలకమన్నారు.

'తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది'



మాట్లాడుతున్న ఏపీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఆంధ్రప్రదేశ్ బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ నెటివిటీ ఎంప్లాయిస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర (టీఎన్‌ఈడబ్ల్యూస్‌పీ), నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌ఎల్‌టీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలపై ఉమ్మడి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వినతి పత్రం కూడా అందజేశానన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రధాన కారణమని చెప్పారు. గత 9 ఏళ్లలో రాష్ట్రంలో అద్భుతాలు జరిగాయని వలసలు ఆగిపోయి బీడు భూములు పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. టీఎస్‌ఈడబ్ల్యూఎస్‌పీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాయకులు రావుల కిషోర్‌బాబు, రమేష్‌నాయుడు, అంజయ్య, మోహన్‌రావు, సూర్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సెల్ట్ (ఇంగ్లిష్ శిక్షణ కేంద్రం)కోర్సుల్లో ఈ నెల 20న నుంచి కొనసాగే తరగతులకు 18 వరకు దరఖాస్తులను స్వీకరించనునట్లు డైరెక్టర్ డాక్టర్ సవీన్ పేర్కొన్నారు. పది ఆ పై విద్య అర్హతలు గల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణు లు, ఇతరులు సెల్ట్ కోర్సులో ప్రవేశానికి అర్హులని పూర్తి వివరాలకు 7989903001/833 1040963 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాక్షికంగా ఆంక్షల తొలగింపు

ఖైరతాబాద్: ఫార్ములా ఈ రేస్ నేపథ్యంలో ఈ నెల 7 నుంచి ఖైరతాబాద్, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ఐదు రోజుల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు ఆదివారం సాయంత్రం నుంచి కాస్తా ఊరట లభించింది. ఖైరతాబాద్ ప్లైఓవర్, తెలుగుతల్లి ప్లైఓవర్లతో పాటు ఎన్టీఆర్ మార్గ్‌పై వాహనాల రాకపోకలకు అనుమతించడంతో ఖైరతాబాద్, లక్డీకాపూల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయి. ఖైరతాబాద్ ప్రాంత వాసులు రాకపోకలతో పాటు నిత్యావసర పనులకు సైతం ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వచ్చిందని స్థానికులు వాపోయారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఫార్ములా ఈ రేసింగ్ నేపథ్యంలో ఖైరతాబాద్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'వాలంటైన్స్ డేను నిషేధిస్తున్నాం'

సుల్తాన్‌బజార్: ప్రాశ్చాత్య సాంస్కృతి అయిన ఫిబ్రవరి 14న వాలంటైన్స్ డేను నిషేధిస్తూ ఆరోజు అమరుల సైనికుల దినోత్సవం జరుపుకోవాలని బజరంగ్‌దళ్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం వాలంటైన్స్ డేను నిరసిస్తూ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో వాలంటైన్స్ డే గ్రీటింగులను బజరంగ్‌దళ్ నాయకులు దహనం చేశారు.

దళిత బంధు దేశానికే ఆదర్శం



లబ్ధిదారుడికి కారును అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: దళితబంధు పథకం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బత్తుల కిరణ్‌కు దళిత బంధు పథకం ద్వారా మంజూరైన కారును యువజన నాయకుడు ముఠా జైసింహతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వం దళిత బంధు పథకం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత సంక్షేమానికి పెద్దపీట వేసి, బడ్జెట్‌లో దళిత బంధు పథకానికి రూ.17,700 కోట్లను కేటాయించడం అభినందనీయమన్నారు. దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌కే సాధ్యమవుతుందన్నారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, నాయకులు ముఠా నరేష్, శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీశ్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, రవిశంకర్ గుప్తా, సత్యనారాయణ, పీఎస్ శ్రీనివాస్, రాజ్ కుమార్, హనుమంతు, జహంగీర్, వెంకటేష్, చందు, సురేష్, ఎంబీ కృష్ణ పాల్గొన్నారు.

అనుభూతి పొంది రాసేదే ఉత్తమ కవిత్వం

చిక్కడపల్లి: అనుభూతి పొంది భావాలకు అక్షర రూపమిస్తే అదే ఉత్తమ కవిత్వమని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో జరిగిన జాషువా స్మారక కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు కవితా ప్రక్రియలో బహువాదాలున్నా.. ప్రజాపక్షం ప్రధానంగా సమాజహితంగా ఉండాలని విజేతలంతా పరిణితి చెందిన భావాలు కలవారేనన్నారు. ప్రగతిశీల కవి నిఖిలేశ్వర్, మాల్కాజిగిరి మేడ్చల్ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, కవి బిక్కికృష్ణ, విద్యాధరరావు, కవి పెద్దూరి వెంకటదాసు, సాహితీ విమర్శకులు డా. కోటేశ్వరరావు, రచయితలు శైలజమిత్ర, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

- కవితా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు వరుసగా నెల్లుట్ల రమాదేవి, నాగేశ్వర రావు, యాదయ్యతో పాటు మరో 20 మంది బహుమతులు అందుకున్నారు.

దివ్యాంగులకు మొబిలిటీ ఇండియా పరికరాలు

కాచిగూడ: దివ్యాంగుల కోసం అత్యుత్తమ టెక్నాలజీతో కస్టమైస్డ్ డివైస్ పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం కోసం సికింద్రాబాద్ తిరుమలగిరిలో మొబిలిటీ ఇండియా బ్రాంచ్‌ని ప్రారంభించామని ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. గత 29 ఏళ్లుగా బెంగుళూర్ కేంద్రంగా మొబిలిటీ దేశంలో పనిచేస్తోందని ప్రొస్టెసెస్, వెన్నెముక కలుపులు, ఆర్థోసెస్ నడక సహాయాలు, డయాబెటిక్, పాదాల సంరక్షణ, సౌందర్య చికిత్స మొబిలిటీ నడక శిక్షణ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొబిలిటీ ఇండియా అధ్యక్షుడు



డాక్టర్ గిఫ్ట్ నార్మన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎలిజబెత్ థామస్, డాక్టర్ చార్లెస్ ప్రభాకర్, అల్బీనా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో జ్ఞాలేడ్జ్ హైస్కూల్ 31వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని అలాంటి వారిని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రణాళిక బద్దంగా విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, న్యూ ఎరా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, గోల్నాక కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్, దీపక్ కుమార్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక నృత్యాలతో విద్యార్థినులు

ఆకట్టుకున్న లలితారావు నిర్విరామగానం



లలితారావు, టీఎస్‌రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: వేదికలపై తనదైన శైలిలో నేపథ్య గాయమనులు సుశీల, జానకి, లీల, జిక్కిల పాటలను అలవోకగా పాడే లలితారావు విభిన్న గాన ప్రయోగంతో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఆదివారం త్యాగరాయగానసభ ప్రధాన వేదికలో సాయి లలిత మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో లలితారావు 12 గంటల పాటు నిర్విరామ గానలహరిలో పలు సినిమాల్లోని పాటలను ఆలపించి అందరి మన్నలను పొందారు. ఈ సందర్భంగా లలితారావు, టీఎస్‌రావు దంపతులను అభినందించారు. గోపికృష్ణ, సుదర్శన్, డాక్టర్ సంపత్‌కుమార్, వేణుగోపాల్, నందూరి లక్ష్మణ్, రేవతి, దమయంతి, సువర్ణ, అపర్ణ, ప్రముఖ గాయకుడు త్రినాథరావు, కిన్నెర రఘురాం, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ఆరాధన లోకం కృష్ణయ్య, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. లలితారావు, టీఎస్‌రావు దంపతులను ఈ సందర్భంగా అభినందించారు.

మురుగు పరుగు

నల్లకుంట: శంకరమఠం, నల్లకుంట ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి గత కొద్ది రోజులుగా మురుగు పొంగి పొర్లుతోంది. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ఆర్టీసీబస్సులు, ఆటోలు వేగంగా వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. మురుగు నీరంతా రోడ్డు పక్కనుంచే ప్రవహిస్తుండటంతో దుర్వాసన వస్తోందని స్థానిక దుకాణాదారులు, ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యను స్థానిక జలమండలి అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లకుంట ప్రధాన రహదారిలో ఇలా..

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కంటోన్మెంట్: మారుతున్న జీవన శైలిలో భాగంగా తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం ఎంతైనా అవసరమని శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీగణేశ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఆరో వార్డు తాడ్‌బంద్, తవాయిపురాలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీగణేశ్ మాట్లాడుతూ.. చాలా వరకు ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులువవుతుందన్నారు. నిరుపేదలు తరచూ పరీక్షలు నిర్వహించుకునే అవకాశం అంతంత మాత్రంగానే ఉంటుందని ఈ నేపథ్యంలోనే తాము పన్నెండేళ్లుగా తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, డాక్టర్ కిరణ్, డా.రామచంద్ర సాగర్, డా. మొయినోద్దీన్ డా.సూర్య ప్రకాష్, కేర్ హాస్పిటల్ క్యాంప్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, షేక్ ఖాజా పాల్గొన్నారు.